# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

January - 2001

# సంక్షిప్త వార్తలు

2000 నవంబరు 27 సాయంకాలానికి జాషువాగూటం గారును, 28 ఉదయానికి పెర్రి కోతమ్‌గారును నేపాల్‌దేశ ముఖ్యపట్టణమగు ఖాట్మండు చేరుకొని, 28వ తేదీ మంగళవారం నుండి సువార్తకూటములు, బైబిలు తరగతులు అక్కడ నిర్వహించిరి. ఖాట్మండులో బాగ్‌బజార్ క్రీస్తుసంఘ ఆలయములో యివి నిర్వహించబడెను. రోజుకు రెండు పర్యాయములచొప్పున కూటములు జరిగెను. పెర్రికోతమ్‌గారు, జాషువాగారు ఆంగ్లములో ఉపన్యసించగా అవి నేపాలీ భాషలోనికి సోదరులు పరశురామ్ సుంచూరి అనువదించిరి. కూటములలో యిద్దరు హైందవులు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. 29వ తేదీ సాయంత్రము నయాబజార్‌లోని క్రీస్తుసంఘకూడికలో కూడ వీరు పాల్గొనిరి. ఈ రెండు చోట్ల హాజరైన వారందరికీ పెర్రికోతమ్ గారు నేపాలీబైబిళ్ళు అందజేసిరి. డిశంబరు మొదటి తేదీన జాషువాగారు కాకినాడకు, కోతమ్ గారు మద్రాసుకు వెళ్ళిరి.

డిశంబరు 10వ తేదీ ఆదివారం రాత్రికి జాషువాగూటం గారు అమెరికా నుండి వచ్చిన ఐరా రైస్ గారిని మద్రాసులో కలసికొని, వారిద్దరు అండమాన్ దీవులకు మరునాడు చేరుకొని అక్కడ సువార్త సేవ చేయగా అక్కడ యిద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

డిశంబరు 14వ తేదీ గురువారం రైస్ గారు, జాషువా గారు పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట ప్రాంతములో సువార్తపర్యటన గావించిరి. బాలమోరి పాలెం, పెళ్ళికూతురమ్మ చెరువు, తామరాడ గ్రామాలలో ఏర్పాటుచేయబడిన సువార్త కూటములలో వారు వాక్యపరిచర్య చేయగా 15 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఈ మూడు స్థలములలోను ఆచంట క్రీస్తుసంఘ సువార్తికులు సామ్యూల్ రాజుగారు ఆధ్వర్యంలో చక్కని పని జరుగుచున్నది.

డిశంబరు 15వ తేదీ శుక్రవారం కాకినాడ సత్యవాణి బిల్డింగ్‌లో సువార్తికుల సదస్సు జరిగెను. పోస్టల్ సిబ్బంది సమ్మెచేయుట వలన ఆహ్వానములు పలుచోట్లకు అందకపోయినను ఆరోజు 300 పైగా సహోదరులు హాజరై దినమంతయు గొప్ప వాక్యపరిచర్యలోను, ఆత్మీయసహవాసములోను పాల్గొనిరి. సోదరులు ఐరా రైస్‌గారు ఉదయం, సాయంకాలం కూడా వాక్య

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884 - 363722

Editor :

JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 21 జనవరి 2001 సంచిక 6


## బైబిలు గ్రంథకర్త మానవుడు కాదు-2

( Man is not the author of the Bible )

బైబిలు గ్రంథకర్త మానవుడు కాదు అనే అంశాన్ని మనం పరిశీలించుచున్నాము. ఎంతో లోతైన సంగతులను బైబిలు అతి సుళువుగా తెలియజేయుచున్నది. గంభీరసంఘటనలను మానవులకు వల్లకాని విధంగా సంక్షిప్తముగా అది తెలియజేయుచున్నది. అంతే కాదు బైబిలు తెలియజెప్పు సంగతులను బట్టియే కాక, అది తెలియజెప్పని సంగతులను బట్టి కూడ దాని గ్రంథకర్త మానవుడు కాదని గత పాఠంలో మనం గమనించాము. దేవుని ఆరంభమును గూర్చి, యేసుక్రీస్తు యొక్క భౌతిక ఆకృతిని గూర్చి అది మౌనముగాయున్నది. మానవులే గనుక బైబిలును వ్రాసియుంటే వారట్టి లేఖనవిధానాన్ని అనుసరించకపోదురు.

## లేఖనముల మౌనం

యేసు ప్రభువు అద్భుతముగా కన్యక గర్భమున పుట్టెను. పరిశుద్ధాత్మ వలన గర్భవతియై కన్యయైన మరియ ఒక కుమారుని కనెను. ఆయనకు యేసు అను పేరు పెట్టబడెను. యేసుక్రీస్తు జన్మించిన తరువాత ఆయనకు ఇంచుమించు ముప్పయి సంవత్సరముల వయస్సు వచ్చువరకు లేఖనములు నిశ్శబ్దముగా యున్నాయి. ఆయన బాల్యదశ, యౌవనదశ వగయిరాలు ఎట్లు గడిపారో మనకు తెలియదు. వాటిని గూర్చి తెలిసికోవాలనే కుతూహలం మనందరం కలిగి యున్నాము. ఆయనకు ఎనిమిదవ దినమందు సున్నతి చేయబడెనని మనం ఎరుగుదుము. యూదుల ధర్మము ప్రకారము అట్లు చేయబడెను (లూకా 2:21). ముప్పయి మూడు దినములు తరువాత ఆయన యెరూషలేము దేవాలయములో ప్రతిష్ఠించబడెను (లూకా 2: 22-39).

ఆయన జన్మించిన తరువాత తూర్పుదేశపు జ్ఞానులు ఆయనను చూడవచ్చిరి. "రాజైన హేరోదు దినములయందు యూదయ దేశపు బెత్లేహేములో యేసు పుట్టిన పిమ్మట ఇదిగో తూర్పు దేశపు జ్ఞానులు యెరూషలేమునకువచ్చి - యూదుల రాజుగా పుట్టినవాడెక్కడున్నాడు ? తూర్పు దిక్కున మేము ఆయన నక్షత్రము చూచి, ఆయనను పూజింపవచ్చితిమని చెప్పిరి" (మత్తయి 2:1-2). అయితే హేరోదు ఆ శిశువును సంహరింపవలెనని వెదకబోవుచుండెను గనుక తల్లిని, శిశువును యోసేపు ఐగుప్తుకు తరలించెను (మత్తయి 2:13-14). హేరోదు చనిపోయిన తరువాత యోసేపు మరియను, యేసును వెంటబెట్టుకొని గలిలయలో నజరేతను ఊరికి వచ్చి అక్కడ కాపురముండెను (మత్తయి 2:20-23).

## యేసు యొక్క యౌవనం

అటు తరువాత యేసుకు 12 ఏండ్లు వచ్చువరకు ఆయన బాల్యమును గూర్చి క్రొత్త నిబంధన మౌనియైయున్నది. గాని తన 12వ యేట యెరూషలేము

దేవాలయమునకు తలిదండ్రులతో వెళ్లి అక్కడ నిలిచిన సంఘటన తెలియజేయ బడెను (లూకా 2:41-50). తరువాత యేసు జీవితంలో 18 సంవత్సరములు మట్టుకు ఆయన యౌవన కాలమును గూర్చి బైబిలు మౌనమైయున్నది. గాని "యేసు జ్ఞానమందును, వయస్సునందును, దేవుని దయయందును, మనుష్యుల దయయందును వర్ధిల్లుచుండెను" అని బైబిలు చెప్పుచున్నది (లూకా 2:52). అంటే ఆయన మానసికముగా, భౌతికముగా, ఆత్మీయంగా, సాంఘికంగా వర్ధిల్లు చుండెను. ఆయన యౌవనకాలమంతటిని ఈ క్లుప్తమాటలతో పరిశుద్ధాత్ముడు మనకు వర్ణించాడు.

అయితే ఆ మధ్యకాలంలోఆయన మాటలను గూర్చి గాని, చేష్టలను గూర్చి గాని మనకేమీ తెలియదు. తెలిసికోవాలనే కుతూహలం మనకు లేదా ? క్రొత్త నిబంధనను గనుక ఏ మానవుడైనా వ్రాసి వుంటే మనకు తెలియని బోలెడన్ని వివరాలు అందులో అతడు వ్రాసేసియుండును. అట్టి వివరాలు వ్రాయాలని కూడ మనం కాంక్షిస్తాము. అది సహజం. అయితే యేసుయొక్క బాల్యదశ వగయిరాలను తెలిసికోవాలనే కాంక్ష వలన "ప్రక్షిప్త భాగముల సువార్తలు" (Apocryphal Gospels) అనే నకిలీ సువార్తలను మానవులు వ్రాసారు. పరిశుద్ధాత్మావేశముతో వ్రాయబడిన సువార్తలలో లేని క్రీస్తు జీవిత సంఘటనలను గూర్చిన ఆసక్తి వలన ఆత్మప్రేరణలేని ఈ గ్రంథములు వెలువడినవి. అయితే ఈ గ్రంథములు నమ్మదగినవికావు. అవి మానవ లిఖితములే గనుక అవి బైబిలులో భాగము కావు.

అనేక సంగతుల యొక్క వివరములు బైబిలు మనకిచ్చుట లేదు. వాటి వివరణ ప్రస్తుతం మనకు అక్కర్లేదన్నమాట. వాటిని గూర్చి తెలిసికోవాలన్న కాంక్ష మనకుండవచ్చును. గాని బైబిలు మన కుతూహలాన్ని తీర్చడానికి వ్రాయబడలేదు. మానవమాత్రులుగా ఆలోచిస్తే బైబిలులో మరికొన్ని సంఘటనల వివరాలు లేనట్లు గ్రహించగలము.

# మోషే జీవితం

ఉదాహరణకు మోషే జీవితాన్నే గమనిద్దాం. పాతనిబంధనలో అతడు ప్రముఖమైన వ్యక్తి. హెబ్రీ లేఖనాల్లో 750సార్లుకు పైగా అతన్ని గూర్చి చెప్పబడింది. క్రొత్తనిబంధనలో కనీసం 80 సార్లు మోషేను గూర్చి చెప్పబడింది. అతడింకా శిశువుగా యుండగానే ఐగుప్తు రాజైన ఫరో కుమార్తె మోషేను పెంచుకొన్నది. తన కుమారుని ప్రాణం కాపాడుట కొరకు మోషే తల్లి యొక్క సంకల్పము వలన అట్లు జరిగెను. హెబ్రీయుడైనను, ఐగుప్తు యొక్క యువరాజుగా మోషే పెరిగాడు. తన మొదటి 40 సంవత్సరములు ఐగుప్తు దేశము యొక్క ఘనతలోను, ప్రభావములోను అతడు పెరిగాడు. నిర్గమకాండము 2:10లో బాలుడైన మోషే ఫరో కుమార్తె యొక్క కుమారుడవడం మనం చూస్తాము. అయితే తరువాత వచనం "ఆ దినములలో మోషే పెద్దవాడై తన జనుల యొద్దకు పోయి వారి భారములు చూచెను" అని వ్రాయబడియున్నది. అప్పటికి అతనికి నలుబది యేండ్లు. ఈ నలుబది యేండ్ల కాలములో మోషే ఎట్లు పెరిగాడు ? యేమేమి చేసాడు ? తెలిసికోవాలనే కుతూహలం మనకు లేదా? బైబిలును గనుక మానవులు వ్రాస్తే వారు మోషే జీవిత చరిత్రనంతటినీ పూసగ్రుచ్చినట్లు మనకు తెలియ జెప్పుదురు. గాని బైబిలును మానవులు వ్రాయలేదు.

అపొ.కా. 7:22లో, అంటే క్రొత్త నిబంధనలో, "మోషే ఐగుప్తీయుల సకల విద్యలను అభ్యసించి మాటలయందును, కార్యములయందును ప్రవీణుడై యుండెను" అని చెప్పబడింది. ఆ మాటలేమిటి ? అతడు చేసిన కార్యములేమిటి? మోషే జీవితంలో మొదటి 40 సంవత్సరములలో సంభవించిన ఆసక్తికరమైన సంఘటనలేమిటి ? ఇవన్నీ తెలిసికోవాలనే ఆశ మనకుండవచ్చును. గాని ఆ సమాచారాన్ని పరిశుద్ధాత్ముడు తన గ్రంథంలో మనకియ్యలేదు.

## నీతిమంతుడైన యోసేపు సంగతి

అట్లే యేసు యొక్క పెంపుడు తండ్రియైన యోసేపును గూర్చి కూడా క్రొత్త నిబంధన చాలమట్టుకు మౌనముగా యున్నది. అతడు చాల భక్తిపరుడు, నీతిమంతుడని మనకు తెలుసు. తనకు ప్రధానము చేయబడిన మరియ, వారేకము కాకమునుపు పరిశుద్ధాత్మ వలన గర్భవతిగా ఉండెను. ఆమె భర్తయైన యోసేపు నీతిమంతుడై యుండి ఆమెను అవమానపరచనొల్లక రహస్యముగా ఆమెను విడనాడ ఉద్దేశించెను..... కాని ప్రభువు దూత అతనికి ప్రత్యక్షమై - దావీదు కుమారుడవైన యోసేపూ, నీ భార్యయైన మరియను చేర్చుకొనుటకు భయపడకుము, ఆమె గర్భము ధరించినది పరిశుద్ధాత్మ వలన కలిగినది.... ఆయనకు యేసు అను పేరు పెట్టుదువని చెప్పెను. యోసేపు ప్రభువు దూత తనకు ఆజ్ఞాపించిన ప్రకారము చేసి తన భార్యను చేర్చుకొని ఆమె కుమారుని కనువరకు ఆమెను ఎరుగకుండెను; అతడు ఆ కుమారునికి యేసు అను పేరుపెట్టెను (మత్తయి 1:18-25).

అటు తరువాత యేసును 12వ యేట యెరూషలేము దేవాలయమునకు తీసికొని తన భార్యతో కూడ అతడు వెళ్లినట్లు మనం చూస్తాము (లూకా 2:41-52). ఆ తరువాత యోసేపును గూర్చిన సమాచారం మనకేమీ తెలియదు. బైబిలును మానవులే వ్రాసియుంటే అతని వివరాలన్నీ మనకు తెలియ జెప్పకుందురా ?

## మరియ సంగతి

అంతేకాదు, మరియ సంగతి యేమిటి ? ఈ లోకంలో పుట్టిన స్త్రీలందరి కంటే ఆమె పవిత్రురాలే. యేసు సిలువపై మరణించిన తరువాత ఆమె యోహాను యొక్క సంరక్షణలో ఉండియుండెను. యేసు సిలువపై వ్రేలాడుచు మరియ యొక్క బాధ్యతను యోహానుకు అప్పగించినట్లు యోహాను 18:26-27లో మనం

గ్రహించగలము. యేసు సమాధినుండి తిరిగిలేచి పరమునకు ఆరోహణుడైన తరువాత ఆమె శిష్యులతో కలిసి యెడతెగక ప్రార్థన చేయుచుండెనని అపొ.కా. 1:14 వలన మనకు తెలుసు. అయితే ఆ తరువాత ఆమెకేమి జరిగింది ? ఎంతకాలం బ్రతికింది. ? ఎట్లు చనిపోయింది ? ఈ విషయాలను గూర్చి మనకు ఇసుమంతయును సమాచారం లేదు. క్రొత్తనిబంధనను ఏ మానవుడైనా వ్రాసియుంటే ఈ వివరాలన్నీ మనకు తెలియజేయకుండా విడిచిపెడతారా ? అయితే బైబిలును మానవులు వ్రాయలేదనడానికి ఇదొక గొప్ప నిదర్శనం. మానవుల కుతూహలాన్ని తీర్చడానికి ఆ గ్రంథము వ్రాయబడలేదు. ఏలయనగా దాని గ్రంథకర్త మానవుడు కాదు.

అందుకే "యెహోవా గ్రంథమును పరిశీలించి చదువుకొనుడి"యనే హెచ్చరిక మనకీయబడింది (యెషయా 34:16). మరియు "యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు దివారాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు. అతడు నీటికాలువలయోరను నాటబడినదై ఆకు వాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె యుండును" (దా. కీర్తన. 1:1-3). సశేషం.

## అపవాదిని గూర్చి జాగ్రత్త
## (Beware of Satan)

సాతానుడు ఈనాడు కూడా జీవించియున్నాడు. ఈ లోకంలో అతడు లేని ప్రదేశము లేదు. పేతురు ఇట్లన్నాడు : "నిబ్బరమైన బుద్ధి గలవారై మెలకువగా ఉండుడి; మీ విరోధియైన అపవాది గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు" (1పేతురు 5:8). పేతురు చెప్పిన కొన్ని సంగతులను జాగ్రత్తగా గమనించుము :

1. **నిబ్బరమైన బుద్ధికలిగి మెలకువగా యుండాలి :** అంటే ఎప్పుడు

ఎల్లవేళల పరాకు లేకుండా భద్రముగా యుండాలి. నీవు వేసే ప్రతి అడుగును గమనించి జాగ్రత్తగా యుండాలి. మెలకువగా యుండి నీవు చేయు ప్రతిదానిని గూర్చి తీవ్రముగా ఆలోచించుకో.

**2. నీకొక విరోధియున్నాడు :** ఆ విరోధి అపవాదియే. నీకు తెలిసినను, తెలియకపోయినను అతడు నీ విరోధి. అతడు నిన్ను నాశనముచేయజూచు చున్నాడు; నీవు జాగ్రత్తగా యుండకపోతే నిన్ను నాశనము చేస్తాడు.

**3. అపవాది గర్జించు సింహము వలే యున్నాడు :** అతడొక సింహము కాదు గాని సింహముకున్న లక్షణాలన్నీ వానికున్నాయి. అతడు బలవంతుడు, అపాయ కరమైన వాడు, క్రూరుడు. అతడుకుయుక్తి పరుడు. ఒక్కోసారి చాల సాధువుగా కనబడతాడు. అయినను నిన్ను పట్టుకొని మ్రింగివేయడమే అతని ముఖ్య ఉద్దేశ్యము.

**4. అతడు తిరుగుచున్నాడు :** అంటే అతడు ఒక్కచోటనే యుండడు. అస్తమానము చలిస్తూనే యుంటాడు. మరొకని పట్టుకోడానికి నిన్ను దాటిపోవచ్చు గాని, అతడు మరల నీయొద్దకు వస్తాడు. ఇప్పుడో మరొకప్పుడో నిన్ను తప్పక పట్టుకొందునని అతడు ఎల్లప్పుడు తలస్తాడు.

**5. ఎవని మ్రింగుదునాయని అతడు వెదకుచున్నాడు :** అతడు కష్టపడి కృషి చేస్తాడు. తన పని ఎన్నడు విడిచిపెట్టడు. అతడు నిరంతరము వెదకుచున్నాడు. నిన్ను తన బలిగా చేయగోరుచున్నాడు.

ఆఫ్రికాలో తిరుగులాడు వన్యజంతువుల చలనచిత్రాన్ని ఎప్పుడైనా చూచావా? అక్కడ అన్ని రకాల జంతువులు వేలకొలది కనబడతాయి. వాటిలో కొన్ని క్రూర జంతువులైనను, అవన్నీ కలిసే ఉంటాయి. అవి చాలా మట్టుకు గడ్డి

తినే బ్రతుకుతాయి గాని కొన్ని యితర జంతువులను చంపుకు తిని బ్రతుకుతాయి. సింహాలు, పులులు, చిరుతపులులు మొదలగునవి తొందరయేమీ లేనట్లు నడుస్తాయి, లేదా పరుగెడతాయి. ఎప్పుడు కావాలంటే అప్పుడు చంపుకు తినడానికి వాటి ఆహారము కళ్ల ఎదురుగానే వాటికి కన్పిస్తాది. మిగతా జంతువులన్నీ గడ్డిమేస్తూనే యుంటాయి గాని ఎల్లప్పుడు అప్రమత్తముగా యుంటాయి. వాటి చుట్టూ అపాయం ఆవరించుకొనే యుంటాది. ఏ క్షణంలోనైనా క్రూరమృగములు వాటిపై బడవచ్చును. ఈ ప్రమాదం నుండి కాపాడడానికి వాటిలో చాలా జంతువులకు చిన్నపిల్లలు కూడా యుంటాయి.

ఇటువంటి సందర్భములోనే శత్రువు ఎదుర్కొని మీద పడడానికి ఎదురు చూస్తూ యుంటాడు. బహుశ అతడు ఒక చిన్న దానిని, కుంటిదానిని చూస్తాడు. బహుశ మిగిలిని మందనుండి కొంచెము దూరంగా తొలగి మేయుచున్న జంతువు వానికి కన్పడవచ్చును. సరిగ్గా అప్పుడే శత్రువు వానిమీద పడ్తాడు. బలహీనమైన వాటిని, వయస్సులో చిన్నవాటిని, జబ్బుగల వాటిని తరుముతాడు; బలముగా యున్న వాటిని కూడా తరుముతాడు. చివరకు అవి పారిపోలేక ఈ క్రూరమృగానికి బలియైపోయేవరకు తరుముతాడు. అవి దొరకగానే వాటిని చంపుతాడు. అప్పుడు విందు ఆరంభమౌతాది. ప్రకృతిలో యివి ప్రతిరోజు జరుగుతున్న సంఘటనలే.

## ప్రతిదిన పోరాటము

అపవాది అనేక రూపాలు ధరించినను అతడు నిజంగాయున్నాడు. మరియు జీవన్మరణముల పోరాటము ప్రతిదినము జరుగుచునేయుంటాది. అపవాది ఎవని మ్రింగుదునా యని వెదకుచు తిరుగుచున్నాడు. ఒక్కోసారి అతన్ని మనం గుర్తించ గలము, పసిగట్టగలము. మరి కొన్నిసార్లు అతడు సత్క్రియలు, భక్తితత్వము వెనుక దాక్కొని యుంటాడు. అతడు పట్టుకొనబోయే వాళ్ళు చాలామంది. వాళ్ళు అనేక సంగతులలో తలదూర్చి అప్రమత్తతను కోల్పోతారు. వారితో యున్నవాళ్ళు

చాలమంది గనుక చాల మంచి సహవాసంలోనే యున్నామనుకొంటారు. వారితో యున్న వాళ్ళందరు చేసే సంగతులనే చేయుచున్నాము గనుక మనకేం పరవాలేదను కొంటారు. కొందరు యౌవనస్థులు, యితరులు, రోగులు, బలహీనులు, అంతా బాగానే యున్నదని ఒక వ్యక్తి భావించేటప్పుడు, అతని బలహీనత ఎక్కువగా యున్నచోట అపవాది వానిమీద పడ్తాడు. అది జరిగినప్పుడు సాధారణంగా అపవాది జయిస్తాడు. తాను పడిన వానిని బలిగా చేసుకొని నాశనం చేస్తాడు.

అపవాది మన సమీపానికి రాకుండా జాగ్రత్తపడాలని హెచ్చరించు నిమిత్తం యిదంతా చెప్పబడినది. అతని వల్ల ప్రమాదమేమి లేదు; మనకేమీ హానిచేయడని మనం తలంచరాదు. పైకి అమాయకముగాను, ప్రమాదమేమి లేని వాటిగను కన్పడే వాటితో వాడు మనలను శోధింపనీయరాదు. మిత్రులారా, సాతానుడు మనకు సహాయం చేయడానికి గాక, మనలను నాశనం చేయడానికే యున్నాడు. ఈ లోకంలో గాయపడడం, ప్రాణం కోల్పోవడం శోచనీయం గాని అపవాది మనలను ఆత్మీయంగా నిత్యము నాశనం చేయజూచుచున్నాడు.

మనకు హెచ్చరిక ఇయ్యబడినది. ఈ హెచ్చరికను తీవ్రంగా గైకొంటే మనము జ్ఞానం గలవారమే. సాతానుడు మనలను గాయపరచగలడు. గాని అతడు మనల్ని గాయపరచనక్కరలేదు. ప్రభువు సహాయం వలన వానినుండి మనము కాపాడబడగలము. మనము ప్రభువుకు లోబడినప్పుడాయన మనలను పాపము నుండి రక్షిస్తాడు. మనమాయనకు నమ్మకముగా యుంటే ఆయన మనతో యుండడానికి, సాతానును, శోధనలను జయించుటలో సహాయం చేయడానికి ఆయన వాగ్దానం చేసాడు (మార్కు 16:16; మత్తయి 28:20; 1కొరిం..10:15). అంతేగాకుండా శిష్యులాయనకు నమ్మకముగా యుండుటకు క్రీస్తు అన్ని సదుపాయములు చేసియున్నాడు. ఆయన తన వాక్యాన్నిచ్చాడు, మన ప్రార్థనలను విని వాటికి జవాబీయడానికి వాగ్దానం చేసాడు, మనలను ప్రోత్సహించడానికి

క్రీస్తులో అనేక సహోదర సహోదరీలనిచ్చాడు (హెబ్రీ 4:12; 1యోహా. 5: 16,17; గలతీ. 3: 26,27).

గనుక సహోదరులారా, అపవాదిని గూర్చి జాగ్రత్త! అప్రమత్తతను కోల్పోయి వాని సమీపానికి రావద్దు. అతని నుండి దూరంగా తొలగిపొండి. వాని నుండి కాపాడబడడానికి ప్రతి విధమైన జాగ్రత్త తీసికోవాలి. అపవాది మనలను పట్టుకొని నాశనం చేస్తే ఆ పొరబాటు మనదేగాని మరెవరిదిగాదు.

- జె.సి. ఫోట్.

# ప్రభువు నామమును బట్టి ప్రార్ధనచేసి రక్షింపబడుట

(Call upon the Lord and be saved)

రోమా 10:13-16

"ప్రభువు నామమును బట్టి ప్రార్ధన చేయువాడెవడో వాడు రక్షింపబడును" (రోమా 10:13). ప్రభువు నామమున ప్రార్ధనచేయుట మానవునికున్న ప్రాముఖ్యమైన పని. ఇశ్రాయేలీయులు ప్రభువు నామమును బట్టి ప్రార్ధన చేయుట మానినప్పుడు వారి నీతియంతయు మురికి గుడ్డవలె యుండెను (యెష. 64:4-7). మనుష్యులందరి సత్క్రియలన్నియు మురికి గుడ్డలని దీని భావము కాదు, ఏలయనగా క్రైస్తవుల సత్క్రియలు దేవుని మహిమపరచునని బైబిలు బోధించుచున్నది (మత్తయి 5:16).

ప్రభువు నామమును బట్టి ప్రార్ధన చేయడంలో పాపి తాను నశించిన స్థితిలో యున్నాడని గ్రహించుకొనడం, రక్షింపబడుట అవుసరమని గ్రహించి రక్షణ కోరుకొనడం ఇమిడియున్నాయి. తనలో గాక క్రీస్తులో నమ్మిక కలిగియుండడం దానిలో యున్నది. అతడు పిలువ గలవాడెవడును ఇకలేడు. గనుక ప్రభువును పిలుస్తాడు (యోహాను 6:68).

## పాపి ఎట్లు పిలుస్తాడు ?

యేసు ఇట్లన్నాడు : "ప్రభువా ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును" (మత్తయి 7:21). ఆయన చిత్తాన్ని విని దానిని జరిగించువానినే ప్రభువు వింటాడు (యోహాను 9:31).

ప్రభువు నామమున నిలచి రక్షింపబడుట యెట్లో అపొ.కార్యములు రెండవ అధ్యాయములో మనకు కనబడును. ఆ అధ్యాయము 21వ వచనంలో యోవేలు చేసిన ప్రవచనము ఈలాగు చెప్పబడినది :"అప్పుడు ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయువారందరును రక్షింపబడుదురు" (అపొ.కా. 2:21). 47వ వచనములో కొందరు రక్షింపబడి ప్రభువుచే సంఘముతో చేర్చబడినట్లు మనము చూడగలము.

ప్రభువు నామమును బట్టి ప్రార్థనచేసి రక్షింపబడుట యెట్లో తెలిసికోవాలంటే వారేమి చేసారో మనం తెలిసికోవాలి. ఏలయనగా వారి రక్షణలో యోవేలు ప్రవచన నెరవేర్పున్నది. వారు మారుమనస్సు పొందారు, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందారు (అపొ.కా. 2 : 38-41). అందువలననే అననీయ సౌలుతో "లేచి ఆయన నామమును బట్టి ప్రార్థనచేసి బాప్తిస్మము పొంది నీ పాపములు కడిగివేసుకొనుమని చెప్పెను" (అపొ.కా. 22 : 16).

నీవు సరియైన రీతిలో ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేసావా ? నీవు క్షమించబడి రక్షింపబడాలంటే అట్లు చేయాలి, నీవు మారుమనస్సు పొందిన విశ్వాసివైతే ప్రభువు నామమును ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందు, రక్షింపబడు.

- జీన్ ఓవర్టన్.

# రక్షించునట్టి విశ్వాసము
## (The Faith that Saves)

మానవులు రక్షించబడవలెనంటె విశ్వాసము అత్యవసరము. విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము. "నేను ఆయనను (అనగా దేవుని కుమారుని) అని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురు" అని యేసు చెప్పెను (యోహాను 8:24). గనుక మనము విశ్వాసము కలిగియుండుట చాల అవుసరము.

అయితే విశ్వాసము ఒక్కటి మాత్రమే సరిపోవునా? మనము రక్షించబడవలెనంటె ఎట్టి విశ్వాసమును మనము కలిగియుండవలెను? రక్షించునట్టి విశ్వాసము ఎట్టిది? దేవుని వాక్యము దీని విషయమై ఏమి చెప్పుచున్నది? దానిని కొంత ఇప్పుడు చూచుకొందము. యాకోబు 2 :14-26 వరకు ఇప్పుడు చదువుకొందము.

"నా సోదరులారా, క్రియలు లేనప్పుడు ఎవడైనను తనకు విశ్వాసము కలదని చెప్పిన యెడల ఏమి ప్రయోజనము? అట్టి విశ్వాసమతని రక్షింపగలదా? సహోదరుడైనను, సహోదరియైనను దిగంబరులై ఆనాటికి భోజనము లేక యున్నప్పుడు మీలో ఎవడైనను శరీరమునకు కావలసిన వాటిని ఇయ్యక-సమాధానముగా వెళ్ళుడి, చలికాచుకొనుడి, తృప్తిపొందుడని చెప్పిన యెడల ఏమి ప్రయోజనము? ఆలాగే విశ్వాసము క్రియలు లేనిదైతే అది ఒంటిగా ఉండి మృతమైనదగును..... దేవుడొక్కడే అని నీవు నమ్ముచున్నావు. అలాగు నమ్ముట మంచిదే: దయ్యములును నమ్మి వణకుచున్నవి: వ్యర్థుడా, క్రియలులేని విశ్వాసము నిష్ఫలమైనదని తెలిసికొనగోరుచున్నావా? మన పితరుడైన అబ్రహాము తన కుమారుడైన ఇస్సాకును బలిపీఠము మీద అర్పించినప్పుడు అతడు క్రియల వలన నీతిమంతుడని తీర్పు పొందలేదా? విశ్వాసము అతని క్రియలతో కూడిన కార్యసిద్ధి కలుగజేసెననియు, క్రియలు మూలముగా అతని విశ్వాసము పరిపూర్ణమైనదనియు గ్రహించుచున్నావు గదా?

.... కాబట్టి మనుష్యుడు విశ్వాసము మూలమున మాత్రమువ కాక (Not by faith only) క్రియల మూలమునను నీతిమంతుడని యెంచబడునని. మీరు దీనివలన గ్రహించితిరి: ప్రాణము లేని శరీరము ఏలాగు మృతమో అలాగే క్రియలులేని విశ్వాసము మృతము".

## విధేయత

యాకోబు వ్రాసిన సంగతిని గమనించండి. మీకు విశ్వాసము ఉన్నంత మాత్రమున అది సరిపోదు. మీ విశ్వాసమునకు క్రియలు జోడించుడి. అప్పుడు మాత్రమే మీరు నీతిమంతులని యెంచబడుదురు. మీ విశ్వాసమునకు మీరు విధేయులు కాని యెడల అట్టి విశ్వాసము మిమ్మును రక్షించదు. విశ్వాసము క్రియలు లేనిదైతే అది ఒంటిగా ఉండి మృతమైనదగును. అబ్రాహాము యొక్క విశ్వాసము ఎట్లు పరిపూర్ణమాయెను? ఆతడు దేవుని యందు విశ్వసించుటయే కాకుండ దేవుని మాటలకు సంపూర్ణ విధేయత చూపించుటవలననే కాదా? ఈనాడు మనము పరిపూర్ణులము ఎట్లు కాగలుగుదుము? దేవుని వాక్యమును విశ్వసించుటయే కాదుగాని, ఆ వాక్యమునకు విధేయత చూపుట ద్వారానే కదా. యేసు ప్రభువునందు నేను విశ్వసించుచున్నాను గాని, నేను ఆయన నామమున బాప్తిస్మము పొందుటకు నాకు ఇష్టములేదు అని నీవు చెప్పవచ్చును. అట్టి విశ్వాసము నిన్ను రక్షించగలదా? ప్రాణములేని శరీరము ఏలాగు చచ్చినది అగునో ఆలాగే క్రియల ద్వారా విధేయత చూపని విశ్వాసము కూడాను, చచ్చినదగును.

## విధేయులైన వీరులు

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 11వ అధ్యాయమును మనము చూచిన యెడల అనేకమంది విశ్వాసవీరులను గూర్చి పరిశుద్ధాత్ముడు అందు మనకు సాక్ష్యమిచ్చుచున్నాడు. విశ్వాసమును బట్టి హేబేలు కయీను కంటె శ్రేష్ఠమైన బలిని దేవునికి అర్పించెను. విశ్వాసమును బట్టి హానోకు మరణము చూడకుండునట్లు

కొనిపోబడెను. విశ్వాసమును బట్టి నోవహు తన ఇంటివారి రక్షణ కొరకు ఒక ఓడను సిద్ధము చేసెను. విశ్వాసమును బట్టి అబ్రాహాము పిలవబడినప్పుడు ఎక్కడికి వెళ్ళవలెనో అది ఎరుగక బయలువెళ్ళెను. విశ్వాసమును బట్టి ఇస్సాకు, యాకోబు, యోసేపులు దేవుని చిత్తమును జరిగించిరి. విశ్వాసమును బట్టి మోషే ఐగుప్తు ధనముకంటె క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొని, అల్పకాలము పాపభోగము అనుభవించుటకంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించి పనిచేసెను. ఇకను ఏమి చెప్పుదుము? గిద్యోను, బారాకు, సమ్సోను, యెఫ్తా, దావీదు, సమూయేలును గూర్చియు, ప్రవక్తలను గూర్చియు వివరించుటకు సమయము చాలదు. వారు విశ్వాసము ద్వారా రాజ్యములను జయించిరి, నీతి కార్యములను జరిగించిరి, వాగ్దానములను పొందిరి; సింహముల నోళ్ళను మూసిరి, అగ్నిబలమును చల్లార్చిరి. ఖడ్గధారను తప్పించుకొనిరి, బలహీనులుగా వుండి బలపర్చబడిరి.

వారు విశ్వాసము ద్వారా చేసిన అనేక ఘనకార్యములను గూర్చి మనము చెప్పుకొనవచ్చును. అయితే వీరందరు ఘనులెట్లయిరి? వారందరు తమ విశ్వాసమును క్రియల ద్వారా నిరూపించుట వలనే గదా? వారిలో ప్రతి ఒక్కడూ కూడా దేవుడు వానికి ఏమి ఆజ్ఞాపించెనో ఆ ఆజ్ఞను అక్షరాలా నెరవేర్చిరి. వారందరు దేవుని యెడల తమకున్న విశ్వాసమును బట్టి విధేయత చూపించిరి. అందువలన వారు నీతిమంతులని తీర్చబడిరి. వారి విధేయత ద్వారా వారి విశ్వాసము పరిపూర్ణ మాయెను. అవిధేయత చూపుచూ దేవునికి నమ్మకముగా నున్న ఏ ఒక్కని గూర్చియైనను బైబిలు బోధించుటలేదు. సరిగదా విశ్వాసులలో అవిధేయతను దేవుడు ఖండించుటయే గాక శిక్షించినట్లు బైబిలు నందు అనేక సందర్భములలో మనము చూడగలము. "ఒకడు దహనబలులను అర్పించుట వలన ఆయన సంతోషించునా? ఆలోచించుము. బలులు అర్పించుటకంటె ఆజ్ఞలు గైకొనుటయు, పొట్టేళ్ళ క్రొవ్వు అర్పించుటకంటె మాట వినుటయు శ్రేష్టము'' అని దైవవేదము బోధించుచున్నది (1సమూ 15 : 22).

విశ్వాసము మనలను ఎట్లు రక్షించును ? మనము దేవుని ఆజ్ఞలకు **విధేయత** చూపుటకు ప్రోత్సహించుట ద్వారా అది మనలను రక్షించును. దేవుని **వాక్యమును** వినుట ద్వారా చదువుట ద్వారా మనకు ఆ విశ్వాసము కలుగును **(రోమా 10:17; యోహాను 20:30-31)**. ఒకడు రక్షింపబడవలెనంటె అతడు **చేయవలసిన** కొన్ని పనులున్నవి. పాపులైనవారు యేసునందు విశ్వాసము ఉంచవలెనని దేవుని వాక్యము ఆజ్ఞాపించుచున్నది. "నేను ఆయనను అని మీరు విశ్వసింపని యెడల మీరు మీ పాపములలోనే మరణింతురు" అని యేసు చెప్పుచున్నారు.

అనేకులు యేసు దేవుడు, దేవుని కుమారుడు అని విశ్వసించి అంతటితో ఆగిపోవుదురు. నేను యేసు ప్రభువును, నా ఆత్మ రక్షకునిగా అంగీకరించుచున్నాను అని అనేకులు మాకు ఉత్తరాలు వ్రాస్తూయుంటారు. యేసు నందు విశ్వాసముంచ గానే, లేదా ఆయనను అంగీకరించగానే మేము రక్షించబడితిమి అని వారి అభిప్రాయము. అయితే అట్టి విశ్వాసము ఒక్కటి మాత్రమే రక్షించగలదా? నీవు యేసు ప్రభువు నందు నమ్మికొనుము, వెంటనే నీవు రక్షించబడుదువు అని అనేకులు బోధించుచున్నారు. నీవు నమ్మినంత మాత్రముననే రక్షించబడుదువని వాక్యము చెప్పుచున్నదా? విశ్వసించిన మాత్రముననే నీవు రక్షించబడగలవా?

యాకోబు **2:24** ఏమి చెప్పుచున్నది? "మనుష్యుడు విశ్వాస మూలమున మాత్రము కాక క్రియలమూలమునను నీతిమంతుడని యెంచబడును" అని చెప్పుచున్నది. ఇందులో ఏది సత్యము? మానవుల సిద్ధాంతములా లేక దేవుని వాక్యమా? మన ఆత్మ రక్షణకు దేవుని వాక్యమునే అంగీకరించుట మనకు క్షేమకరము కదా? అవును, నీవు యేసునందు విశ్వాసముంచావు, బాగున్నది. విశ్వసించిన నీవు మారుమనస్సు పొందవలెనని యేసు ఆజ్ఞాపించుచున్నాడు : "మీరు మారుమనస్సు పొందనియెడల మీరందరును ఆలాగే నశింతురు" అని లూకా 13:3లో ఆయన చెప్పుచున్నాడు. అటు తరువాత యేసు దేవుని కుమారుడని నీవు విశ్వసించు చున్నట్లు, నీ విశ్వాసమును మనుష్యుల యెదుట ఒప్పుకొనవలెనని

యేసు చెప్పుచున్నాడు. "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోక మందున్న నాతండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును" అని మత్తయి 10:32లో ఆయన చెప్పుచున్నాడు. అనేకులు నీ పాపములను మనుష్యుల యెదుట ఒప్పుకొనవలెనని బోధింతురు. పాపములను మనము దేవుని యెదుట ఒప్పుకొన వలెను. మనుష్యుల యెదుట అయితే మన విశ్వాసమును ఒప్పుకొనవలెనని బైబిలు బోధించుచున్నది.

## బాప్తిస్మము అవుసరము

నీవు యేసునందు విశ్వసించావు. పాపముల విషయమై మనస్సు మార్చుకున్నావు. యేసు దేవుని కుమారుడని ఒప్పుకుంటావు. బాగుంది. అయితే క్రీస్తు యిచ్చు రక్షణలోనికి ప్రవేశించుటకు ఒకే ఒక్కటి నీవు చేయవలెను: బాప్తిస్మము పొందవలెను. అబ్బే నేను నీవు చెప్పినవన్నీ చేయుదును గానీ బాప్తిస్మము అవుసరము లేదనుకుంటాను అని నీవు అనుకోవచ్చును. మార్కు 16:16లో యేసు ఏమి చెప్పుచున్నాడో ఒక్కసారి వినండి, "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును". నీ విశ్వాసమునకు బాప్తిస్మము పొందుట ద్వారా విధేయత చూపించుము. అపొ.కా 2:38లో "మీరు మారుమనస్సు పొంది, పాప క్షమాపణ నిమిత్తము ప్రతీవాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మముపొందుడి" అని పరిశుద్ధాత్ముడు చెప్పుచున్నాడు. బాప్తిస్మము ద్వారా ప్రభువు నీ పాపములను కడిగివేయును. బాప్తిస్మము పొందిన తరువాతనే నీవు రక్షించబడుదువు. కానీ దానికి ముందు కాదు. "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది" అని 1పేతురు 3:21 చెప్పుచున్నది.

మీలో ఎవరైనను నేను విశ్వసించగానే రక్షింపబడితిని అని అనుకొనుచున్న యెడల యేసుప్రభువు గాని, పరిశుద్ధాత్ముడు గాని, అపొస్తులులు గాని అట్లు బోధించలేదని గ్రహించుడి. విధేయత చూపించు విశ్వాసమే రక్షించునట్టి విశ్వాసము.

విశ్వాసమొక్కటి మాత్రమే ఎన్నడూ, ఎవరిని, ఎక్కడా రక్షించలేదు. అట్లయిన దయ్యములు కూడ రక్షించబడును కదా?

- జాషువా గూటం.

# మతశాఖల తత్వము క్రైస్తవ్యము కాదు

## (Denominationalism is not Christianity)

క్రైస్తవులందరు కేథలిక్కులు కాదు. వారు ప్రొటెస్టాంటులు కూడ కాదు. క్రొత్త నిబంధనలో ఈ రెండు తెగలు కనబడవు. ప్రొటెస్టాంటులనబడువారు పలు డినామినేషన్లుగా చీలిపోయారు. ఒక్కొక్క డినామినేషన్ యొక్క బోధ, ఆచరణ, నిర్మాణపద్ధతి వేర్వేరుగాయుండును. ఈ శాఖలన్నీ కలిసి క్రీస్తు సంఘ మగునని వారిలో కొందరి వాదన. అయితే రోమన్‌కేథలిక్కు సంఘము ఎట్లు క్రీస్తు సంఘము కాదో అట్లే మతశాఖలు కూడాను. ఏలయనగా:

### వాటి సభ్యత్వపు షరతులు వేర్వేరు

ఒకడు క్రీస్తు సంఘములో సభ్యుడగుటకు, మతశాఖలలో సభ్యుడగుటకును వున్న షరతులు వేర్వేరు. దేవుని సంకల్పములో సంఘమునకొక గొప్ప ప్రాధాన్యత ఇయ్యబడెను. అది ఒకేఒక్క సంఘము. ఆ సంఘము క్రీస్తు శరీరము (కొలస్స **1:18; ఎఫెసీ 4:4).**

**మతశాఖలు :** క్రీస్తును నీ స్వంత రక్షకునిగా అంగీకరించు. ఆయన యందు విశ్వాసముంచు. నీవు రక్షింపబడతావు అని చెప్పుదురు.

రక్షింపబడాలంటే బాప్తిస్మము పొందనక్కర్లేదని వారు చెబుతారు. మరియు రక్షింపబడాలంటే సంఘసభ్యుడవు కానక్కరలేదని వారు చెబుతారు.

క్రైస్తవ్యము : రక్షింపబడిన వారిని ప్రభువు తన సంఘముతో చేర్చుకొనును (అపొ.కా. 2:47).

ఎవరైతే సువార్తను విని (రోమా 10:13-19), విశ్వసించి (యోహాను 8:24), పాపముల విషయమై మారుమనస్సు పొంది (అపొ.కా. 2:38) క్రీస్తునందలి విశ్వాసమును ఒప్పుకొని (రోమా 10:10) బాప్తిస్మము పొందుతారో (మార్కు 16:16), అట్టివారు రక్షింపబడి ప్రభువుచే ఆయన సంఘముతో చేర్చబడుదురు (అపొ.కా. 2:47).

బాప్తిస్మము ఒకని క్రీస్తులోను, ఆయన సంఘములోను ప్రవేశింపజేయును (గలతీ 3:27; రోమా 6:3-6; 1కొరింధీ 12:13).

ఈ విధంగా విశ్వాసమునకు లోబడుట ద్వారా మనం క్రీస్తు సంఘ సభ్యులవుదుము.

క్రీస్తే సంఘమునకు రక్షకుడైయున్నాడని పౌలు చెప్పెను (కొలస్స 1:18; ఎఫెసీ 5:25).

క్రీస్తు సంఘమునకు రక్షకుడైన యెడల, రక్షింపబడవలెనంటే రక్షింపబడిన వారితో మనము చేర్చబడాలి. అంటే ఆయన సంఘములో యుండాలి.

గమనిక :-

రక్షింపబడిన వారు సంఘములో యుందురని బైబిలు బోధించుచున్నది. రక్షింపబడిన వారే సంఘమైయున్నారు. వారు స్థానికంగా ఆరాధించుటకును, పనిచేయుటకును కూడుకొందురు. ఈ స్థానిక సంఘములు క్రీస్తు సంఘములని పిలువబడినవి (రోమా 16:16).

మతశాఖల వారైతే ఒకడు విశ్వాస మూలమున మాత్రమే రక్షింపబడునని, అట్టివాడు సార్వజనికమైన క్రీస్తు శరీరములో సభ్యుడని బోధింతురు. అయితే తానేర్పరచుకొనిన డినామినేషన్ వారి పద్ధతి చొప్పున బాప్తిస్మము పొందాలి.ఆ బాప్తిస్మము రక్షణ కొరకు కాదు. ఏలయనగా అన్ని డినామినేషన్లలోను యున్న మంచి వారందరు రక్షింపబడుదురని వారు విశ్వసింతురు. అంటే ఎక్కడ వున్నా పరవాలేదని వారి భావన. అయితే ఒక ప్రశ్న : క్రీస్తు సంఘము ప్రాముఖ్యమైనదా?

**జవాబు** : క్రీస్తు దాని కొరకు రక్తము చిందించి ప్రాణమును సహా బలిగా అర్పించునంత ప్రాముఖ్యమైనది అది (అపొ.కా. 20:28). గనుక ఇక్కడ క్రైస్తవ్యము, మతశాఖలు వేర్వేరైనవి.

క్రీస్తు సంఘము క్రీస్తు యొక్క రక్తముచే కొనబడినది (అపొ.కా. 20:28). క్రీస్తు రక్తముచే రక్షింపబడని వాడెవడును దానిలో సభ్యుడు కానేరడు. క్రీస్తుసంఘములో లేకుండా ఆయన రక్తముచే కడుగబడిన వాడెవడును లేడు.

తమ సంఘము క్రీస్తురక్తముతో కొనబడినదని ఏ డినామినేషన్ వారు చెప్పుకోలేరు. వారి డినామినేషన్‌లో లేకుండానే జనులు రక్షింపబడుదురని వారు చెప్పుదురు.

క్రీస్తు సంఘములో డినామినేషన్లు భాగములు కావు. రక్షింపబడాలంటే డినామినేషన్‌లో యుండనక్కరలేదు. అన్ని డినామినేషన్ల నాయకులు దీని నంగీకరిస్తారు.

## వాటి నిర్మాణ పద్ధతి వేరు

సంఘము యొక్క నిర్మాణము ఎట్లున్నది ?

**మతశాఖలు** : బైబిలు మనకు ప్రత్యక్షమైన పద్ధతిని గూర్చి చెప్పుటలేదు. గనుక మన విజ్ఞానాన్ననుసరించి సంఘనిర్మాణ పద్ధతి (Organisation) యుండును.

మొదటి శతాబ్దములో యున్న నిర్మాణ పద్ధతి వేరు. వీటి పద్ధతి వేరు. ఏలాగున ఆర్గనైజ్ చేసినను పరవాలేదు. పోపులు, కార్డినల్స్, ఆర్చ్‌బిషప్పులు, ప్రెసిడెంటులు మొదలగు వారుండవచ్చును.

**క్రైస్తవ్యము** : సంఘమునకు శిరస్సు క్రీస్తు (ఎఫెసీ 1:22-23). సంఘనిర్మాణ పద్ధతి అంతా స్థానికమే.

స్థానికసంఘమును మించిన సంస్థ మరొకటి లేదు. భూమిమీద కేంద్రస్థానము (Head Quarter) లేదు. భూమి మీద ఏమానవుడు దానికి శిరస్సు (Head) కాదు. ప్రతి స్థానిక సంఘమునకు పెద్దలు, పరిచారకులు, సువార్తికులు, సభ్యులు వుందురు. వారు తమ తమ పరిధిలోనే పనిచేయుదురు. మరొకస్థానిక సంఘముపై వారికి అధికారము లేదు. (ఫిలిప్పీ 1:1; తీతు 1:5; అపొ.కా. 14:23). స్థానిక సంఘములన్నియు ప్రేమ, సహకారము, బోధ, ఆచరణలో ఏకత్వము కలిగియుండును. వాటి ఆరాధన పద్ధతులు వేరు.

**మతశాఖలు** : దేవుడు పలానా విధంగా ఆరాధించుడి యని చెప్పి ఒక ప్రత్యేక పద్ధతినియ్యలేదు. గనుక ఆయనను ఎట్లైన ఆరాధించవచ్చును.

ప్రభురాత్రి భోజనం ఎప్పుడు (ఎంతకాలం కొకసారి) ఆచరించినా పరవాలేదు. దానిలో తరచు పాల్గొంటే దాని భావం కోల్పోతాది. ఆరాధనలో వాద్యాలు వినియోగించవచ్చును.

**క్రైస్తవ్యము** : ఆదిమ క్రైస్తవులు రొట్టె విరుచుటకు ప్రతి ఆదివారమున కూడు కొనిరి (అపొ.కా. 20:7). ప్రతి ఆదివారమున కానుకల నిచ్చిరి (1కొరింథీ 16:1-2). వాద్యములు లేకుండా పాటలు పాడిరి (ఎఫెసీ 5:19).

దేవుని వాక్యపఠనము గావించిరి (అపొ.కా. 17:11; 2తిమోతి 3:16-17). ప్రార్థించిరి (ఎఫెసీ 6:18; 1కొరింథీ 14:15)

"దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యము తోను ఆరాధించవలెను" (యోహాను 4:24).

గమనిక :

దేవుని సేవించుటకు డినామినేషన్లు అవుసరం లేదు. మొదటిశతాబ్దములో డినామినేషన్లు యేమీ లేవు. ఒక్కటి కూడ లేదు. క్రీస్తు సంఘములు మాత్రమే యుండెను (రోమా 16:16). క్రీ॥శ॥ 1521లో లూథరన్ డినామినేషన్ ఉద్భవించినప్పుడు, ఇప్పుడున్న ఏ డినామినేషన్ కూడ అప్పుడు లేదు. అప్పటికి కేథలిక్కులుండిరి. వారెట్లు వచ్చిరో యిదివరకే మనము గమనించాము. మొదటి శతాబ్దములో మతశాఖలు లేకుండా క్రీస్తు సంఘము మాత్రమే యుండగలిగిన యెడల, నేడు కూడ అది సాధ్యమే. మొదటి శతాబ్దములో కేథలిక్కులు ప్రొటెస్టాంటులు గాక కేవలం క్రైస్తవులు మాత్రమే యుండగలిగిన యెడల నేడు కూడా అదియు సాధ్యమే.

x 0 x

# వేరొక సువార్తను ప్రకటించుట

అపొ.పౌలు సువార్తను ప్రకటించాడు గనుక సువార్త అంటే యేమిటో అతడెరుగును. అది క్రీస్తుయొక్క మరణ, సమాధి, పునరుత్థానముల శుభవర్త మానము (1కొరింథీ 15:1-4). రక్షింపబడాలంటే ఒకడు సువార్త ఆజ్ఞలకు విధేయుడు కావాలి (మార్కు 16:16; అపొ.కా. 2:38). యేసు ప్రభువునందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, క్రీస్తునందలి విశ్వాసమును మనుష్యులయెదుట ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుటలో ఒకడు సువార్తకు లోబడుటయే గాక (2 పేతురు 4:17), అతడు క్రీస్తు యొక్క మరణసమాధి పునరుత్థానములను చిత్రీకరించుకొనును.

గలతీయులకు వ్రాస్తూ పౌలు యిట్లు చెప్పాడు. "క్రీస్తు కృపను బట్టి మిమ్మును పిలిచిన వానిని విడిచి, భిన్నమైన సువార్త తట్టుకు మరింత త్వరగా తిరిగిపోవుట చూడగా నాకాశ్చర్యమగుచున్నది. అది మరియొక సువార్త కాదుగాని, క్రీస్తుసువార్తను చెరుపగోరి మిమ్మును కలవరపరుచువారు కొందరున్నారు. మేము మీకు ప్రకటించిన సువార్తగాక మరియొక సువార్తకు మేమైనను, పరలోకమునుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్తుడవును గాక. మేమిదివరకు చెప్పిన ప్రకారము ఇప్పుడును మరల చెప్పుచున్నాము; మీరు అంగీకరించిన సువార్త గాక మరియొకటి ఎవడైనను మీకు ప్రకటించిన యెడల వాడు శాపగ్రస్తుడవును గాక" (గలతీ 1:6-9).

పౌలు చెప్పినది విన్నావా ? గలతీయలోని క్రైస్తవులు ఒకే ఒక్క సువార్తను వినియున్నారు. వారు తొందరలోనే సత్యమును వీడి భిన్నమైన సువార్త తట్టుకు తిరిగినందున అతడు ఆశ్చర్యపోయాడు. అది కలుషితం చేయబడిన సువార్త, అసత్య సువార్త, రక్షింపని సువార్త. పౌలు చేసిన హెచ్చరిక యేమంటే , తానుగాని, వేరొకడు గాని లేదా దేవదూతగాని వారు వినిన సువార్తకు భిన్నమైన దానిని బోధిస్తే అతడు శాపగ్రస్తుడవుతాడు ! "మేమిది వరకు చెప్పిన ప్రకారమిప్పుడును మరల చెప్పుచున్నాను; మీరు అంగీకరించిన సువార్తగాక మరియొకటి యెవడైనను మీకు ప్రకటించిన యెడల వాడు శాపగ్రస్తుడవును గాక" యని అతడు వక్కాణించాడు.

ఈ హెచ్చరిక ఇంతకంటే విపులముగా ఎట్లుండగలదు ? ఆ ఒకే ఒక్క సువార్తను బోధించాలని ఇంకెంత గట్టిగా చెప్పగలము ? సత్యసువార్తను మార్చివేసి వేరొక సువార్తను బోధించువాడు శాపగ్రస్తుడవుతాడనుట కంటే ఇంకెంత గట్టిగా హెచ్చరించబడాలి ? పౌలు గాని, వేరొకడు గాని, చివరకు దేవదూత గాని వేరొక సువార్తను బోధింపకూడదు. అట్టివాడు శిక్షను తప్పించుకోలేడు. సువార్తను బోధింపమనే ఆజ్ఞను దేవుడు దూతలకు గాక మానవులకే యిచ్చారు. అయితే

చివరకు దేవదూతే వచ్చి వేరొక సువార్తను ప్రకటిస్తే అతడు కూడ శిక్ష తప్పించుకొనడని పౌలు యొక్క ఉద్దేశ్యం.

యిదంతయు దేవుని వాక్యంలో నిలిచియుండి దానినే బోధించే ప్రాముఖ్యతను, తీవ్రతను, అత్యవసరాన్ని మనకు చూపించుచున్నది. ప్రభువు మార్గమును, ఆయన బోధను మనం మార్చకూడదు. సత్యము వలన ఒకని ఆత్మ రక్షించబడును గాని అసత్యము ఒకని ఆత్మను నాశనము చేయును. ప్రభువు యొక్క మార్గము ఒకని పరలోకమునకు చేర్చునుగాని మానవుల మార్గము నాశనమునకు నడుపును.

పౌలు యొక్క కాలములోనే అబద్ధబోధకులు, అబద్ధ బోధలు, కాని సువార్తలు వున్నాయని ఈ లేఖన భాగమును బట్టి మనం హెచ్చరింపబడు చున్నాము. అదే సమస్య నేటికిని కొనసాగుచున్నది ! నిజానికి రక్షింపబడడానికి డజను మార్గములన్నట్లు మానవులు నేడు బోధించుచున్నారు. అంటే డజను సువార్తలను బోధించుచున్నారన్నమాట !

ఒకడు రక్షింపబడి పరలోకమునకు వెళ్ళాలంటే యేమి చేయాలో ప్రభువు తన సత్యసువార్తలో బయలుపరచినను, అనేకులు ఆయన చిత్తానికి భిన్నముగా మానవకల్పిత సువార్తను విశ్వసించుచున్నారు. గ్రుడ్డిగా వాటిననుసరించుచున్నారు. దాని వలన కలుగు పరిణామము తీవ్రమైనది. క్రీస్తు సంఘస్తులు కూడా ఒక్కోసారి ఈ అసత్య సువార్తల తట్టు తిరుగుచుండుట విచారకరము.

మానవకల్పిత సిద్ధాంతములను, బోధలను ప్రకటించు వారిని ప్రభువే ఖండించారు (మత్తయి 15:9). ప్రభువా, ప్రభువా అని ఆయనను పిలుచు ప్రతివాడు పరలోకమునకు చేరుకోలేడని ఆయనే చెప్పారు (మత్తయి 7:21-23). అనేకులు విశాల మార్గములో పోవుచున్నారు. అయితే ఇరుకైన జీవమార్గములో

ప్రవేశించువారు కొందరేయని ఆయన చెప్పారు (మత్తయి 7:13-14). బేధములను, ఆటంకములను కల్పించువారిని కనిపెట్టుకొని యుండాలని పౌలు హెచ్చరించాడు (రోమా 16:17-18). క్రీస్తు బోధయందు నిలిచియుండని వాడు దేవునితో లేడని యోహాను వ్రాసాడు (2యోహాను :9).

వేరొక సువార్తను బోధించుటకు దయచేసి ప్రయత్నించవద్దు ! !

- జె. పి. ఫోట్.

ఉచితం! ఉచితం! ఉచితం!

మీ ఇంటనే ఉండి బైబిలును చదవండి.
యేసుక్రీస్తును ఆయన బోధనలను తెలుసుకోండి.
మేమిచ్చు ఉచిత బేసిక్ బైబిలు కోర్సులో చేరండి.
పోస్టుద్వారా ఆ పాఠములను పూర్తిచేసి
ఒక బైబిలును ఉచితముగా పొందండి

SATYA VANI, P.O. Box 80, KAKINADA - 533 001. A.P.

పరిచర్య చేసిరి. క్రీస్తుయొక్క సువార్తను క్రీస్తు సంఘస్థులే ప్రపంచమంతటా వెదజల్లే బాధ్యతను కలిగియున్నారని, వారు క్రీస్తుయొక్క రెండవ రాకడ కొరకు ఎల్లవేళలా సిద్ధపడియుండాలనీ హెచ్చరించిరి. వారితోబాటు సోదరులు టి.వి.యన్ కుమార్, పి.చంద్రశేఖర్ గార్లు కూడా చక్కటి వాక్యపరిచర్యచేసిరి. సోదరులు రైస్‌గారు వ్రాసిన బేసిక్ బైబిల్ కోర్సు పూర్తిచేసిన ఇంచుమించు 45 మంది తమ యోగ్యతా పత్రమును, బైబిలును రైస్‌గారి ద్వారా బహుమతిగా పొందిరి. మధ్యాహ్నభోజనవిరామసమయంలో నలుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. సదస్సుకు హాజరైన వారందరికీ చక్కటి భోజనం ఏర్పాటు చేయబడెను. సదస్సు సాయంత్రం 4గంటలకు ముగియగా సోదరసోదరీలందరూ తమతమ గ్రామములకు తరలివెళ్ళిరి.

డిశంబరు 16వ తేదీ శనివారం పశ్చిమగోదావరిజిల్లా పెనుమంచిలిలోను, కోడూరులోను ఏర్పాటుచేయబడిన సువార్తకూటములలో సోదరులు రైస్‌గారు, జాషువా గూటంగారు పాల్గొని వాక్యపరిచర్యచేసిరి. కూటముల అనంతరం నలుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. పెనుమంచిలిలో సోదరులు యం. జోసెఫ్ గారు, కోడూరులో కుసుమ దామోధరరావ్ గార్లు వాక్యపరిచర్య చేయుచున్నారు.

డిశంబరు 17వ తేదీ ఆదివారం ఉదయం సోదరులు రైస్‌గారు కాకినాడ, రామారావ్‌పేట క్రీస్తుసంఘములో వాక్యపరిచర్యచేసిరి. ఆరాధనలో పాల్గొనిరి. అటు తరువాత కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌ను దర్శించి విద్యార్థులను హెచ్చరించిరి. ఆ రాత్రికి తూర్పుగోదావరి జిల్లా పెదపళ్ళలో ఏర్పాటుచేయబడిన సువార్త కూటములో పాల్గొనిరి. వాక్యపరిచర్య చేసిరి. అక్కడ ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. పెదపళ్ళలో సోదరులు జి. ఇశ్రాయెల్ గారు వాక్యపరిచర్య చేయుచున్నారు డిశంబరు 18వ తేదీన సోదరులు రైస్ గారు విశాఖపట్టణం నుండి ఢిల్లీకి, అక్కడ నుండి అమెరికాకు పయనమై వెళ్ళిరి.

డిశంబరు 22వ తేదీ శుక్రవారం నిజామాబాద్ జిల్లాలో ఒన్నాజిపేట గ్రామములో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును రిబ్బను కత్తిరించుట ద్వారా జాషువాగూటం గారు దేవుని పనికొరకు ప్రతిష్టచేసిరి. ఈ ఆలయమునకు సోదరులు యన్. టైటస్ గారు, జాషువాగూటం గారు 1999 ఏప్రియల్ మాసములో పునాదివేసిరి. సోదరులు టైటస్‌గారు ప్రభువునందు నిద్రించక

ముందు ఈ ఆలయమును ముగించిరి. ఆలయప్రతిష్ట సందర్భములో పలువురు సోదరులు టైటస్ గారి కృషిని జ్ఞాపకము చేసి కొనిరి. వారి కుమారుడు ఎబినేజర్‌గారు ఇప్పుడు టైటస్ గారు వదలి వెళ్ళిన ప్రతి పనిని సమర్ధవంతముగా నడుపుచున్నారు. ఒన్నాజీపేట క్రీస్తుసంఘ ఆలయం ప్రతిష్ట అనంతరము 5గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. నిజామాబాద్ జిల్లాలో టైటస్‌గారు పరిచర్యచేసిన సంఘములన్నింటి నుండియు సోదరులు వచ్చి ఈ సంతోషకార్యములో పాలుపంచుకొనిరి. హాజరైన వందలాది ప్రజలకు స్థానిక సంఘము మంచి విందునేర్పాటు చేసిరి. 23వ తేదీ ఉదయానికి సోదరులు జాషువాగూటం గారు క్షేమముగా కాకినాడ చేరుకొనిరి. నిజామాబాద్ జిల్లాలో సోదరులు యన్. ఎబినేజరు గారి ద్వారా జరుగుచున్న పని కొరకు అందరు ప్రార్థించండి.


RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/2001


From :
**SATYA VAKKU**
P.O. BOX 80,
KAKINADA - 533 001

TO


*Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani - Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St., KAKINADA - 533 004. Editor : Joshua Gootam.*